# రికమెండేషన్ — పి. లక్ష్మి

"ఏమండీ, మన రంగమ్మ కొడుకుని కాన్వెంటులో చదివిస్తుందిట. మిమ్మల్ని కాస్త రికమండేషన్ చేసి పెట్టమందండీ! మీరు చెప్తే తప్పక సీటు దొరుకుతుందని దాని నమ్మకం..."

రెండు రోజులుగా అడగాలనుకున్న విషయం శ్రీవారి మూడ్ చూసి టక్కున అడిగేశాను ఆ రోజు.

పేపరు చదువుతున్న శ్రీవారు పేపరు పక్కకి తప్పించి ఆశ్చర్యంగా చూశారు నా వంక.

"రంగమ్మ...కొడుకు...కాన్వెంటులోనా? ఇంతకంటే పెద్ద జోక్ లేదా?" అన్నారు నవ్వుతూ ఒక్కొక్క పదమే ఒత్తి పలుకుతూ.

"మీ కన్నీ నవ్వులాటగానే ఉంటాయండీ. ఏం మీరూ, నేనూ తప్ప ఇంకెవరూ కాన్వెంటులో పిల్లల్ని చదివించకూడదా?" అన్నాను చిరుకోపం ప్రదర్శిస్తూ.

"కోపం తెచ్చుకోకు. ఇప్పటికే ఆ ఎల్.కె.జి. సీట్లకోసం అందరూ కొట్టుకు చస్తున్నారు. ఇక రంగమ్మ, ఎల్లమ్మ, నన్నానమ్మ అందరూ ఆ కాన్వెంట్లకే ఎగబడితే మనగతి ఏం గాను?"

శ్రీవారి మాటలు నా కెందుకో అంతగా రుచించలేదు. మౌనం వహించాను.

"ఇంతకీ రంగమ్మ కొడుకు డాక్టరా? కలెక్టరా?" అన్నారు రెట్టింపు ఎగతాళిగా.

"చూడండి మిమ్మల్ని అడిగింది ఎల్.కె.జి. సీటు గురించిగాని, ఎమ్.బి.బి.ఎ.స్. సీటుకోసం కాదు! అదీ రికమండేషన్ చేసే పొజిషన్‌లో మీ రున్నారు కాబట్టి...అడుగుతున్నాను..." అన్నాను కటువుగానే.

"అదినరే, నీ రికమండేషన్ ఏమిటిట మధ్య? తనే వచ్చి నన్ను డైరెక్టుగా అడగొచ్చుగా?" అనేసి మళ్ళీ—"అవున్లే, రామదాసంతటివాడు 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ' అని ఆ సీతాదేవికే మొర పెట్టుకున్నాడు!" అన్నారు కొంటెగా నా వైపు చూసి.

"అసలు ఇంతకీ మీ రీ విషయంలో ఏమైనా సహాయం చేస్తారా? చెయ్యరా?" నా సహనం తగ్గుతోంది క్రమేపీ.

"... ... ..."

"ఏమండీ—చాలా ప్రాధేయపడుతూ అడిగిందండీ. మీ రొక్క మాట చెప్తే చాలు పని జరుగుతుంది...ప్లీజ్!" అన్నాను బ్రతిమలాడే ధోరణిలో.

మా ఊళ్ళోకల్లా ఆ కాన్వెంటుకి గొప్ప పేరు ఉంది. అందులో సీటు దొరికితే కలెక్టరు పదవి వచ్చినంత గొప్ప. అందుకే సాధారణంగా ధనవంతులంతా తమ పిల్లల్ని చేర్చేది ఆ కాన్వెంటులోనే. అందువల్ల ఆ కాన్వెంటులో సీట్లకి కాంపిటీషన్ ఎక్కువైంది. ఇప్పుడు మా పనిమనిషి రంగమ్మ కూడా తన కొడుకుని అక్కడే చదివించాలని సరదా పడుతూ ఉంటే, శ్రీవారిని సంప్రదించకుండా నేనే అన్నాను—"బాబుగారు చెప్తే నీ కొడుక్కి సీటు ఇట్టే దొరుకుతుందే" అని. ఇంతవరకూ పది, పదిహేను మందికి రికమెండ్ చేసి సీట్లు ఇప్పించారు. రంగమ్మ ఇంట్లో పనిమనిషి కదా? ఆమాత్రం సాయం చేయకుండా ఉంటారా? అని నా ధైర్యం.

"చెప్పండి...ఓ.కే.యేనా?" అన్నాను ఆశగా.

"చూడు సుజా, ఇలాంటి వాళ్ళకి మనమేదో చెప్పి సీటు ఇప్పించినా తరువాత—తరువాత ఆ ఫీజులు కట్టలేక మానిపించేస్తారు. మన మాట వృథా పోతుంది. అయినా...కాలువ గట్లంట కూర్చుని చుట్టలు కాల్చుకునే వెధవలు...వీళ్ళకి కాన్వెంటు చదువు లెందుకు తెద్దూ?" శ్రీవారి మాటలు నా ఉత్సాహాన్ని ఉఫ్‌మని ఊదేశాయి.

ఆఖరి ప్రయత్నంగా—"ఎంత ఖర్చైనా రంగమ్మ భరించడానికి సిద్ధంగానే ఉందండీ! నాలుగు కూలి పనులు కూడా చేసుకుని ఎంత డబ్బైనా సంపాదించి కొడుకుని పెద్ద చదువు చదివించాలని దాని తాపత్రయం... వాడు కూడా చాలా చురుకైన వాడండీ. నేను చూశాను" అన్నాను. ఆఖరి తీర్పుకోసం నిరీక్షిస్తున్న ముద్దాయిలాగుంది నా పరిస్థితి.

"సుజా, చూడు...మనం రికమండేషన్ చేసినవాళ్ళు కాస్తో కూస్తో హోదాలో ఉంటే ఫరవాలేదు. బొత్తిగా ఒక పనిమనిషి కొడుక్కి...ఆఫ్టరాల్ ఎల్.కె.జి. సీటు కోసం నా కున్న పరపతిని వినియోగించుకోవాలంటే...అదే కాస్త ఇబ్బందిగా ఉంది. నువ్వు అర్థం చేసుకో..." అని పేపరు చదవడంలో మునిగిపోయారు.

నా కొక విషయం అర్థమైంది. ఇక నే నెంత ప్రాధేయపడినా, రంగమ్మ స్వయంగా వచ్చి కాళ్ళమీద పడినా శ్రీవారు ఈ చిన్న ఉపకారం చెయ్యడానికి సుముఖంగా లేరు.

రేపు మళ్ళీ రంగమ్మ అడుగుతుంది. నేనేమని సమాధానం చెప్పాలి? ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాను.

** ** **

మర్నాడు రంగమ్మ పనిలోకి వస్తూనే అడిగింది. "ఏవమ్మా...బాబుగారిని అడిగేరా? సిన్న సీటీ రాసిస్తే సాలునంట." అంత ఉత్సాహంగా అడుగుతున్న రంగమ్మకి నే నేమని చెప్పాలి? నువ్వు 'పనిమనిషి'వి గనుక చెయ్య నన్నారని చెప్పాలా? లేక నువ్వు కూడా మాలాగే పొజిషన్‌లో ఉంటే చేస్తారని చెప్పాలా?

"అదేంటమ్మగోరూ ఆలోసిత్తన్నారు...? మీరు అడగనేదా బాబుగారిని?"

"ఆఁ...అది కాదు. బాబుగారికి తెలిసినవాళ్ళు రెండు రోజుల కిందటే మరో ఊరికి ట్రాన్స్‌ఫర్‌మీద వెళ్ళిపోయారట. అందుకని కుదరదన్నారు. అవకాశం ఉంటే తప్పకుండా చేసేవారే." చెప్తున్నది అబద్ధం కనుక తడబడ్డాను.

ఒక్క క్షణం తేరిపార చూసిన రంగమ్మ తేలిగ్గా నవ్వేసింది—"దాందే ముందమ్మా? బాధ పడకండి. నా నింకెవరినైనా అడుగుతానులెండి" అనేసింది...

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. సమస్య ఇంత తేలిగ్గా పరిష్కారమవుతుం దనుకోలేదు.

** ** **

ఆ రోజు ఆదివారం.

ఉదయం బ్రష్ చేసుకుంటూ శ్రీవారు "సాయంకాలం అయిదింటికల్లా రెడీగా ఉండు. ఆనంద్‌లో మంచి పిక్చర్ రిలీజ్ అయ్యింది. వెళ్దాం" అని చెప్పారు. తన అభిమాన హీరో సినిమా కాబట్టి రిలీజైన రెండ్రోజులలోగా చూడకపోతే నిద్ర పట్టదు!

సాయంకాలం ఒక గంట ముందుగానే ఇంటికి వచ్చిన శ్రీవారు చాలా హుషారుగా ఏదో కొత్త పాట హమ్ చేస్తూ మధ్య మధ్య నన్ను తొందర పెడుతున్నారు—"సుజా, లైమైపోతోంది" అంటూ.

అనుకున్న దానికంటే ఒక అరగంట ముందు బయలుదేరినా దారిలో కనిపించిన ఒక రిద్దరు స్నేహితులని పలకరించి థియేటర్‌కి వెళ్ళేసరికి అయిదైంది. అప్పటికే హాలు ఆవరణలో ఇసుక వేస్తే రాలనంత జనం! ఆ జనసందోహాన్ని చూసిన నా గుండె జారిపోయింది. ఏదైనా భరించగలరేమోగాని, తను చూడాలనుకున్న పిక్చర్ ఏ కారణంవల్లనైనా చూడలేకపోతే ఇక పిచ్చెక్కిపోతుంది శ్రీవారికి. మగవాళ్ళ 'క్యూ' వైపు చూశాను. చీమల బారులాగుంది. లేడీస్ 'క్యూ' మరీ అధ్వాన్నంగా ఉంది. ఒకరి నొకరు తోసుకుంటున్నారు...తిట్టుకుంటున్నారు...ప్చ్! లాభం లేదు. శ్రీవారి వంక చూశాను. అప్పటికే చిరాకుతో చిరచిరలాడుతోంది ముఖం. ఒక్క

## ఆనమోవు

అమెరికాలో ఆనమోవు
అంతరిక్ష శిల్పి
దేశ కాల దేవాలయ
ఆగమ శిల్పి—
కలల శిలలు తొలిచి
కాంతి రేఖలుగా మలిచే
త్రికాల త్రిముఖాల
త్రిభువన భవన శిల్పి
జిజ్ఞాన ప్రజ్ఞాన
ఉపజ్ఞా శిల్పి—
ఊహల ఉలితో
వాస్తవికతను
చెక్కి చెక్కి ఆనంద
సోపానము నిర్మించే
సునిశిత శిల్పి—
విజ్ఞానపు వీథుల్లో
వేదాంతము బోధిస్తూ
నరనారాయణులు కలిసి
నడుపకయే నడుపునట్టి
మర్మ చక్ర కర్మ ధర్మ
మాయా రథ శిల్పి—

డా. జె. బాపురెడ్డి

క్షణం జాలి వేసింది.

"పోనీ, ముందుగా ఫోన్ చేసి చెప్పలేకపోయారా?" అన్నాను...ఏదో మాట్లాడాలన్నట్లు.

"ఆ మాత్రం ఐడియా నాకు రాకపోలేదు. ప్రొప్రైటర్ రాజారావు తెలిసినవాడే కాని, ప్రస్తుతం ఊళ్ళో లేడు. పైగా రిలీజ్ అయిన కొత్తలో రెండు, మూడు రోజులు ఇలాంటి రికమండేషన్స్ అక్సెప్ట్ చెయ్యరు" అన్నారు విసుగ్గా. అతని చూపులన్నీ తన అభిమాన హీరో నిలువెత్తు పటానికి వేసిన పూలదండలమీద నిలిచి ఉన్నాయి!

ఇంటికి తిరిగి వెళ్ళడానికి మనస్సు అంగీకరించలేదు...

"అమ్మగోరూ..." రంగమ్మ పిలుపుకి అటు తిరిగాను...పరుగున వచ్చింది నా దగ్గరికి... "ఈ బొమ్మ సూడ్డాని కొచ్చినారా? టిక్కెట్లు దొరకనేదా?" అంది.

'లే' దన్నట్లు తల ఊపాను. అక్కడ, అప్పుడు, అలా ఒక పనిమనిషితో మాట్లాడ్డం సహించలేక 'సుజా' అని అసహనంగా పిలిచారు శ్రీవారు. "ఎక్కడ ఎవరితో మాట్లాడాలో తెలియదు...ఇప్పుడు దాంతో చెప్పుకున్నందువల్ల ఏమిటి ప్రయోజనం?" విసురుగా అన్న మాటలు కొద్దిగా బాధ కలిగించాయి నాకు.

పది నిమిషాల్లో తిరిగి వచ్చింది రంగమ్మ... చేతిలో రెండు బాల్కనీ టిక్కెట్లున్నాయి! ఆశ్చర్యంతో నేను నోరు తెరిచాను..."ఎలా సంపాదించావ్?" అని.

"మాయజమాని యిక్కడ పనిలో సేరినాడమ్మా నెల రోజులైంది..." అంది నవ్వుతూ. దాని కొడుకు చదువుకి నేను చేయలేని రికమండేషన్, మా సినిమా టిక్కెట్లకోసం రంగమ్మ చేసి చూపించింది. దాని చేతిలో పది రూపాయల నోటుంచి టిక్కెట్లు తీసుకున్నాను. "వెళ్ళండమ్మా...ఆట మొదలెట్టేస్తారు" అని వెళ్ళిపోయింది.

స్క్రీన్‌వైపు చూస్తున్న శ్రీవారు ఏదో గుర్తుకొచ్చి హఠాత్తుగా అన్నారు... "కొంపదీసి రంగమ్మ ఇంకా నా రికమండేషన్‌కి ఆశ పడుతోందో ఏమో? కచ్చితంగా చెప్పేశావా కుదరదని?"

ఆ టైములో కూడా శ్రీవారికి వచ్చిన ఆ కుత్సితపు ఆలోచనకి నవ్వు వచ్చింది. "అందరూ ఏదో ప్రతిఫలాన్ని ఆశించే సహాయం చేస్తారని ఎందు కనుకుంటున్నారు?" చేతనైన సహాయం కూడా చేయలేదనే భావం నా చేత ఆ మాటలని కొంత కటువుగానే పలికించింది.

** ** **

రాత్రి ఎనిమిదైంది. కాలింగ్ బెల్ రెండుసార్లు మోగడంతో లేచి వెళ్ళి తలుపు తీశారు శ్రీవారు.

"హల్లో... రాజారావుగారా? రండి రండి."

"మీతో పని ఉండి వచ్చాను."

"పెద్దవాళ్ళు మీకు మాతో పనులేమిటి? కబురు చెయ్యలేకపోయారా? నేనే వద్దును కదా..." శ్రీవారి వినయం.

"ఫరవాలేదు లెండి. ఇదిగో వీడికి కాన్వెంటులో సీటు ఇప్పించాలి. మీదే బాధ్యత..."

"ఎంత మాట? మీ అబ్బాయా? స్వీట్ బాయ్" శ్రీవారు బుగ్గమీద చిటికె వేసిన శబ్దం...

"నాకు ఎల్.కె.జి. చదివే పిల్లలు లేరండీ...మాకు దగ్గరవాళ్ళ అబ్బాయి..." రాజారావుగారి నవ్వు...

"ఐ... సీ...వన్ మినిట్" లోపలికి వచ్చిన శ్రీవారు పెన్ను, కాగితం తీసుకుని ఏదో రాసి, మడతపెట్టి నావైపు చూస్తూ..."థియేటర్ ప్రొప్రైటర్ రాజారావు నాకు తెలుసునని చెప్పేను కదా? ఆయన... బాబు చాలా ముద్దొస్తున్నాడు చురుగ్గా. ఒక్కసారి చూద్దూ... కాన్వెంటులో చదివే పిల్లలంటే అలాగుండాలి..." అన్నారు అదోలా నవ్వుతూ. ఆ నవ్వు రంగమ్మ కొడుకు చదువు విషయంలో తనెందుకు జోక్యం కలుగజేసుకోలేదో చెబుతూంది. నా మనసులో ఏమూలో సన్నని బాధ!

"ప్రిన్సిపాల్‌గారి పేర లెటర్ రాశాను. ఇది తీసుకువెళ్ళండి. పని జరిగిపోతుంది... బాబూ బాగా చదువుకుంటావా? పెద్ద డాక్టరు కావాలి నువ్వు!" మరోసారి ముద్దులాడిన శబ్దం.

ఫానుగాలికి ఎగురుతున్న తెర సందులో నుంచి తొంగిచూశాను...ఉదయం పనిలోకి వచ్చినప్పుడు రంగమ్మ అన్న మాటలు గుర్తుకొచ్చాయి. 'మేనేర్‌రోడ్డులో మేడింటి బాబుగార్ని అడిగినానమ్మా... ఆ రేరి దగ్గరకో తీసుకెల్తాను...నీ కొడుక్కి సీటు వస్తుందిలే అని హామీ యిచ్చారమ్మా..." అంది పొంగిపోతూ...

చూస్తున్న నా నోటంట మాట రాలేదు...

రాజారావుగారి చెయ్యి పట్టుకుని వచ్చిన, బొద్దుగా, ముద్దుగా...వాడు రంగమ్మ కొడుకు!! ●

